## క్లుప్తంగా

### హిందీ పరీక్షకు ఎనిమిది మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో గురువారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో 189 మందికి 188, ధర్మవరం హైస్కూల్‌లో167 మందికి 163, లంపకలోవ జెడ్పీ హైస్కూల్‌లో 254 మందికి 251, ఒమ్మంగి జెడ్పీ హైస్కూల్‌లోని ఎ సెంటర్‌లో 180 మంది, ఒమ్మంగి బి సెంటర్‌లో 149 మంది వెరసి 939 మందికి 931 మంది పరీక్షలకు హాజరైనట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును స్థానిక సీఐ కె కిషోర్ బాబు పర్యవేక్షించారు. లంపకలోవ, ఒమ్మంగి, ధర్మవరం పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు.

### చలివేంద్రం ప్రారంభం

కిర్లంపూడి: వేసవి నేపథ్యంలో స్థానిక సాయిబాబా ఆలయం వద్ద గౌతు వేంకటరాయుడు, వడ్డి శ్రీనివాస్ నాయుడు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు వాహనదారులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్త పెద్ద యల్లపు శివ, గౌతు మూర్తి, గౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి సత్కారం



ఏపీఎం సూర్యకుమారిని సత్కరిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందిని ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ నెల 4న కోటనందూరులో జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు గాను ఏపీఎం బి.సూర్యకుమారి, సీసీలు బాలేపల్లి నాగమణి, జి.సత్యనారాయణ, కె.నాయుడు, ఇ.దేవుడు, అకౌంటెంట్లు ఎస్.చిన్నమ్మలు, లత, 40 వీఓఏలను శాలువ, మెమెంటోలతో సత్కరించారు. మరింత కష్టపడి పని చేసి ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలని ఎంపీపీ సూచించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

### అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరంలోని సీతారాముల ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద 49 రోజుల పాటు నిర్వహించిన సప్తాహం ముగిసిన నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. తొలుత సప్తాహంలో పాల్గొన్న గాయకులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

### క్రిస్టియన్ మైనార్టీ మోనటరింగ్ ప్రతినిధిగా జార్జిబాబు



కలెక్టర్ ఉత్తర్వులు చూపుతున్న జార్జిబాబు

జగ్గంపేట: కాకినాడ జిల్లాకు ప్రధానమంత్రి 15 సూత్రాల క్రిస్టియన్ మైనార్టీ మోనటరింగ్ ప్రతినిధిగా జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన జార్జిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు గురువారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మండల కో ఆప్షన్ సభ్యుడు, జాన్ వెస్లీ, సువార్త పాల్, డి.రాజారత్నం ఆయనకు అభినందనలు తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 16.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన జువ్వల రెడ్డిబాబు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి కోళ్ల ఫారాలకు అమ్ముతున్నట్లు తెలిసింది. అధికారులు నిందుతుడిపై 6ఏ కేసు నమోదు చేసి, పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### పశువులను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

గండేపల్లి: పశువులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మురారి శివారులో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. పశువులు తరలిస్తున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా వ్యాన్‌లో ఆరు ఆవులు, పది దూడలు ఉన్నాయన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని ద్వారకా గోశాలకు తరలించారు. నిదింతులపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# అన్నివర్గాల ఆనందమే లక్ష్యం

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తునిలో గడపగడపకూ మన ప్రభుత్వం



తుని పట్టణంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణంలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత కంకిపాటి వారి గరువు వీధిలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి అమ్మాజీపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వ పరంగా ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. పలువురు మహిళలు రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని, కాలువల్లో పూడిక తొలగించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవ్వాతాతలకు ఇంటికే పింఛన్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, అక్కచెల్లెమ్మలకు ఆసరాతో పాటు అనేక పథకాల ద్వారా ఆర్థికంగా చేయూత అందించామన్నారు. ఎవరికైనా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందికపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు చెబుతున్న మాయమాటలను నమ్మవద్దని, ప్రజలను కంటికిరెప్పలా చూసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఓటు ద్వారా ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సాపిరెడ్డి శేషమణి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

## ‘జగనన్నే మా భవిష్యత్తు’పై అవగాహన



ఏలేశ్వరం సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



తునిలో జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు/శంఖవరం: గ్రామాల్లో ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేపట్టాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సూచించారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరంలో వైఎస్సార్ సీపీ శ్రేణులకు గురువారం ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ శుక్రవారం నుంచి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. జగనన్న పాలనపై ఇంటింటికీ అభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, లంపకలోవ సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, రామిశెట్టి చినబాబు, అలమండ చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

**‘జగనన్నే మా భవిష్యత్’ పోస్టర్ ఆవిష్కరణ**

తుని: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ కోరారు. పట్టణంలోని కంకిపాటివారి వీధిలో గురువారం జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు ఆవిష్కరించారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని మంత్రి రాజా క్యాంపు కార్యాలయంలో డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము పోస్టర్‌ను ఆవిష్కరించారు. శుక్రవారం నుంచి ఈ నెల 20 వరకూ గ్రామాల్లోని గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పార్టీ తుని మండలాధ్యక్షుడు పోతల రమణ, సకురు నాగేంద్ర నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్యం



శంఖవరంలో ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



గోకవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేద ప్రజలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. శంఖవరంలో ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సొసైటీ అధ్యక్షుడు కొండమూరి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, వైస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్, పార్టీ నాయకులు నాయకులు తోలేటి రాంప్రసాద్, ఉనుకురి యేసురత్నం, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

### రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



తుని ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న శ్రీనివాస్

తుని: కష్టాల్లో ఉన్న పేదలకు సహాయం చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి సోదరుడు, దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్షయ వ్యాధితో చికిత్స పొందుతున్న 230 మందికి గురువారం ఆయన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. తమ కుటుంబం పేదల కోసం నిరంతరం పరితపిస్తోందన్నారు.తమ సోదరుడు, మంత్రి రాజాను స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను విస్తృతం చేసినట్టు తెలిపారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ స్వప్న, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో ఉపాధి హామీ పనులను గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు ప్రారంభించారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

### ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ అమ్మాణి

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం గ్రామానికి చెందిన వృద్ధురాలు బుద్ధ లక్ష్మి అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారు కావడంతో గ్రామ వలంటీర్ వేగి అమ్మాణి సొంత ఖర్చులతో గురువారం ఆసుపత్రికి వెళ్లి లబ్ధిదారు లక్ష్మికి రూ.2,750 పెన్షన్ అందజేసింది. వలంటీర్ అమ్మాణిని ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు, స్థానిక వైస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

### ఆలయ వార్షికోత్సవం

గోకవరం: గుమ్మళ్లదొడ్డిలో వేంచేసిన మహాలక్ష్మి సమేత వాల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో శేషవాహనంపై స్వామి వారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### పేకాడుతున్న నలుగురి అరెస్ట్

గండేపల్లి: పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని బొర్రపాలెం శివారులో పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

## వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి గురువారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 56 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. అమ్మవారికి చీర సమర్పించిన మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య ప్రత్యంగిర హోమంలో పాల్గొన్నారు. వనదుర్గ అమ్మవారికి చీర, సారె, పండ్లు సమర్పించారు. అనంతరం సత్యదేవుని దర్శించి పూజలు చేశారు.

**తలుపులమ్మతల్లికి మహాచండీ హోమం**

తుని రూరల్: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని లోవ దేవస్థానంలో వేంచేసిన తలుపులమ్మ అమ్మవారికి గురువారం మహాచండీ హోమం నిర్వహించారు. ఉదయం వేద పండితులు రాణి సుబ్రహ్మణ్యశర్మ, శశాంక్ త్రిపాఠి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మహాచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించినట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఎస్.అన్నవరంలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వరస్వామికి అర్చకులు సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

## తూర్పు రాజగోపురం వద్దకు సత్యదేవుని నివేదన గంట

అన్నవరం: సత్యదేవుని నివేదన సమయంలో మోగించే కంచు గంటను భక్తులు అందరూ తిలకించేలా తూర్పు రాజగోపురం లోపల గురువారం ఏర్పాటు చేశారు. ఈ కంచు గంటను గతేడాది మాజీ ఎంపీ చుండ్రు శ్రీహరి దేవస్థానానికి సమర్పించారు. ఇప్పటి వరకు ఈ గంట ను స్వామివారి ఆలయం లోపల ఏర్పాటు చేసి నివేదన సమయంలో మోగించేవారు. ఆలయం లోపల ఈ గంట ఏర్పాటు చేయడం వలన ఇరుకుగా ఉండడంతో పాటు మోగించడానికి ఇబ్బందిగా ఉండేది. కాగా ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలతో తూర్పు రాజగోపురంలోకి మార్చారు. ఈ గంట ను ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ గురువారం ఉదయం నివేదన సమయంలో లాంఛనంగా మోగించారు. స్వామివారి యంత్రాలయం వద్ద గల తులాభారాన్ని కూడా భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చే మండపం పక్కకు మార్చారు.

### రూ.50 వేల ఆర్థిక సాయం

తొండంగి: శృంగవృక్షం గ్రామదేవత నూకాలమ్మ జాతర సందర్భంగా జరిగిన ఘర్షణలో మృతి చెందిన నడిపల్లి రాము కుటుంబానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. తొండంగిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాము కుటుంబంతో పాటు ఈ ఘటనలో గాయపడిన బాధిత కుటుంబాలకు మద్దతుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు సలాది బాబులు, నల్లి చిన్నబాబు, పి.సతీష్, బి.రాజా, ఎం.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన బాడితబోయిన వీర వెంకట రామకృష్ణ వైన్ షాపు వద్ద మద్యం బాటిల్స్ కొనుగోలు చేసి వాటిని గ్రామ శివారు చెరువు వద్ద అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ముస్లింలకు మంత్రి రాజా ఇఫ్తార్ విందు



తుని ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: రంజాన్ మాస ఉపవాస దీక్షలను పురస్కరించుకుని స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీక్లబ్ భవనంలో గురువారం సాయంత్రం ముస్లింలకు రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి రాజా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక జామియా మసీదు ఇమామ్ కబీరుద్దీన్ రంజాన్ ఉపవాస దీక్షల ప్రాముఖ్యతను వివరించారు. మానవాళికి అల్లా ఎల్లప్పుడు రక్షణగా ఉంటారన్నారు. మంత్రి రాజాకు పాయసం తినిపించి శాలువాతో సత్కరించారు. మంత్రి రాజా మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్నారని, వారికి అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. తుని మండలం తాళ్లూరులో అసంపూర్తిగా నిలిచిన ఉర్దూ పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. తుని పట్టణం ఉప్పరగూడెం, రాజుపేటలో మసీదుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రెవెన్యూ శాఖ ద్వారా సమకూరుస్తామన్నారు. మతాలు వేరైనా ప్రజలంతా ఒక్కటేనని, అందరూ రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ తుని పట్టణ, రూరల్ మండలాధ్యక్షులు రేలంగి రమణాగౌడ్, పోతల రమణ, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

### బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

తుని/ఏలేశ్వరం/ప్రత్తిపాడు/కిర్లంపూడి/జగ్గంపేట: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. తునిలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరు రామకుమార్, ప్రధాన కార్యదర్శి డీవీఎస్ రాజు సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. ఇటీవల తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది ప్రగడ చక్రరావును ఘనంగా సత్కరించారు. ఏలేశ్వరం మండలంలోని యర్రవరంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు ఏనుగు ధర్మరాజు ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రత్తిపాడులోని బీజేపీ ఓబీసీ మోర్చా కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుండల సాయికుమార్ యాదవ్ ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం పతీ ఇంటికీ బీజేపీ -గ్రామ గ్రామానికి ఓబీసీ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కిర్లంపూడి మండలం వీరవరంలో బీజేపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట వెంకట సర్వారాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు, ఉపాధ్యక్షుడు దొడ్డ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ వసూళ్లపై ఆగ్రహం

కోటనందూరు: దళిత సంఘాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న అక్రమార్కులపై ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు అరుగుల మోషే ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పలువురి అధికారులను దళిత సంఘం పేరుతో డబ్బులు డిమాండ్ చేసిన వారిపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి పాటు పడేందుకు ఏర్పాటు చేసిన సంఘాలను అడ్డం పెట్టుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడడం అన్యాయమన్నారు. ఇతర మండలాలు, జిల్లాల నుంచి కొంత మంది దళిత సంఘాల పేరుతో కోటనందూరు వచ్చి ఇక్కడ అధికారులతో పాటు రైలుమిలులు, వ్యాపారులను డబ్బులు డిమాండఖ చేస్తూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అక్రమార్కులను ఎవరూ ప్రోత్సహించరాదన్నారు.

## జగనన్న కాలనీకి విద్యుత్ కాంతులు

తుని రూరల్: ఎస్.అన్నవరం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన వీధిలైట్లను (విద్యుత్ దీపాలు)ను వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. లే అవుట్‌లో 1068 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో లబ్ధిదారులు చురుగ్గా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు, పంచాయతీ అధికారులు కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి కృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శివాజీ పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనార్టీల హక్కులను పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ చైర్మన్ జోసెఫ్ ఆండ్రూస్

ఏలేశ్వరం: క్రిస్టియన్ మైనార్టీల హక్కులను పరిరక్షించాలని పట్టణ క్రిస్టియన్ మైనార్టీ సంఘం కోరింది. స్థానిక సీఎం చర్చిలో సంఘ చైర్మన్ జోసెఫ్ ఆండ్రూస్ అధ్యక్షతన గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు జోసెఫ్ అండ్రూస్, ఏవీవీ ప్రసాద్, రెడ్డి ఆనంద్‌పాల్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో క్రిస్టియన్ మైనార్టీలకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. మైనార్టీలకు వర్తించే అన్ని చట్టాలను క్రిస్టియన్లకు అమలు చేయాలన్నారు. నగర పంచాయతీలో కో ఆప్షన్ పదవిని క్రిస్టియన్ మైనార్టీలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు పిలిప్, ఆనంద్ కుమార్, సామ్యూల్, రమేష్, నిల్సన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై గరంగరం

- మండల సమావేశంలో మండిపడిన ప్రజాప్రతినిధులు
- తక్షణమే విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



వ్యవసాయ శాఖ పనితీరును వివరిస్తున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారంలో ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను సైతం విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తాండవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న మంచినీటి ట్యాంకులు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు సైతం అసంపూర్తిగానే మిగిపోయాని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివాజీ జాప్యానికి కారణాలు వివరించి త్వరలోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయం, రెవెన్యూ, విద్య, వైద్యం, మేజర్, మైనర్ ఇరిగేషన్, వైఎస్సార్ క్రాంతిపథం, ఐసీడీఎస్ తదితర శాఖల పనితీరుపై ఎంపీపీ లగుడు శ్రీనివాసు సమీక్షించారు. మండలాభివృద్ధే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి గోవిందు, వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమజ్జయంతి

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గురవారం ఘనంగా జరిగాయి. మహా చైత్ర పూర్ణిమను పురస్కరించుకుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కలువ పూలు, తమలపాకులు, వివిధ రకాల పత్రిలతో స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం గోపూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మున్సిపల్ ఉద్యోగుల నిరసన

తుని: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అమరావతి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం తుని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఉద్యోగుల సంఘం నాయకుడు కె.శివాజీ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలేశ్వరం: జాతీయ రహదారిపై మండలంలోని యర్రవరం వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యర్రవరం జాతీయ రహదారిపై పేరవరం జంక్షన్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. శరీరంపై నీలిరంగు గళ్ల షర్టు ఉంది. వివరాలు తెలిసిన వారు సెల్ నంబర్ 9440 904835 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.